క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

నకరికల్లు: చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టిసారించాలని డీబీఆర్సీ పల్నాడు, గుంటూరు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప సూచించారు. దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు, కౌలు రైతులు, మహిళా రైతులు అపరాల పంటల వైపు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సీసీఆర్సీ కార్డులు పొంది రైతుభరోసా, పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఎరువులు, పురుగుమందులు రాయితీపై పొందవచ్చన్నారు. రైతులు తమపొలాల్లో పంటమార్పిడి చేసేందుకు భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎకరాకు రూ.10వేల చొప్పున అందజేస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీబీఆర్సీ మండల ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ మండల కన్వీనర్ గుండాల మాణిక్యరావు, సర్పంచ్ పరసా అంజమ్మ, పలువురు రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం మట్టి రోడ్డుపై నానాయాగీ

సత్తెనపల్లి: మండల పరిధిలోని రామకృష్ణాపురం వద్ద రూ.34 కోట్లతో కేంద్రీయ విద్యాలయ భవనం నూతనంగా నిర్మాణమైంది. ప్రధాన రహదారి నుంచి భవనం వద్దకు విద్యార్థులు వెళ్లే రహదారి 500 మీటర్లు మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు చిత్తడిగా మారింది. అధికారికంగా ఈ భవనం ఇంకా ప్రారంభం కాలేదు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పేరెంట్స్ అడిగిన వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పందించి ఇటీవల పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జిల్లా మినరల్ ఫండ్ నుంచి రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయిస్తానని ప్రకటించారు. నిధుల మంజూరు ప్రక్రియ నడుస్తున్న క్రమంలో గత రెండు రోజులుగా ప్రతిపక్షాలు దీనిపై నానాయాగీ చేయడం విస్మయానికి గురిచేస్తుంది. వర్షం కురిసినప్పుడు మట్టి రోడ్డు చిత్తడిగా మారడం సర్వసాధారణం. ఉన్నఫలంగా రోడ్డు వేయాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని పలువురు పేర్కొంటు న్నారు.

రేపటి నుంచి రోజు మార్చి రోజు మంచినీటి సరఫరా

సత్తెనపల్లి: పట్టణంలో గార్లపాడు రోడ్డులోగల మంచినీటి చెరువులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున నాగార్జునసాగర్ డ్యామ్‌లో కూడా నీటి నిల్వలు లేనందున పురపాలక సంఘం ద్వారా మంచినీటిని ఈనెల 26 నుంచి రోజు మార్చి రోజు సరఫరా చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం తెలిపారు. మొదటి రోజు 11, 12, 13 వార్డులకు సంబంధించి రాజులకాలనీ, బోయ కాలనీ, పార్క్ ఏరియా, 14, 15, 16, 17, 18 వార్డులకు సంబంధించి పాత బస్టాండ్, వడ్డవల్లి, కుమ్మరిపాలెం, శాస్త్రి నగర్ ఏరియాలకు సరఫరా చేస్తామన్నారు. రెండోరోజు 1, 2, 30, 31 వార్డులకు సంబంధించి అంబేడ్కర్ నగర్, రంగా కాలనీ, వావిలాల్ నగర్, 3, 4, 25, 26, 27, 28, 29 వార్డులకు సంబంధించి రైల్వేస్టేషన్ రోడ్, సంఘం బజార్, ముస్లిం ఏరియా, 5, 6, 7, 8, 9, 10 వార్డులకు సంబంధించి నాగార్జుననగర్, క్రిస్టియన్ పేట, స్టేట్ బ్యాంకు వెనుక బజార్, 19, 20, 21, 22, 23, 24 వార్డులకు సంబంధించి మెయిన్ రోడ్, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, నాగన్నకుంట, కొత్తపేట, పాతసాలిపేట ఏరియాలకు సరఫరా చేయడం జరుగు తుందన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ

నకరికల్లు: భూ యజమానులతో మాట్లాడి సాగు చేస్తున్న పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ ఖరీఫ్-2023పై గ్రామ రెవెన్యూ, గ్రామ వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలకు ఈ-క్రాప్ బుకింగ్ మూలమని అన్నారు. కౌలుదారులు, భూయజమానులతో మాట్లాడి సీసీ కార్డులు మంజూరు చేయాలని సూచించారు. ఆర్ఐ సీహెచ్. యువరాజు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం చేసి.. చోరీకి యత్నం



నాదెండ్ల: ఇంటి ముందు నిలిపి ఉంచిన కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి కారులోని వస్తువుల చోరీకి యత్నించిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పెడవల్లి సాంబశివరావు ఎండుగుంపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటాడు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చి పశువుల ఆసుపత్రి ఎదురు ఉన్న చెట్టు కింద కారు నిలిపాడు. అయితే సోమ వారం ఉదయం కారు వెనుక అద్దాలు ధ్వంసం చేసి డోర్లు తెరిచి ఉండటాన్ని గుర్తించాడు. కారులో విలువైన వస్తువుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

జగనన్న పాలనలో పేదల వద్దకే ప్రభుత్వం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ధరణికోటలో జగనన్న సురక్ష క్యాంపు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: పేదల గడపలోకి ప్రభుత్వాన్ని తెచ్చి వారి కష్టాలు తెలుసుకుని తీరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాత్రమేనని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం ధరణికోట -2 సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్యాంపులో లబ్ధిదారుల నుంచి 641 దరఖాస్తులు రాగా అందులో 577 ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. లబ్ధిదారుల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వాన్ని పేదల వద్దకు తెచ్చిన ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. పేదల లబ్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన ఆలోచన జగనన్న సురక్ష అన్నారు. దీని ద్వారా లబ్ధిదారులకు అధికారులు చుట్టూ తిరిగే శ్రమ తగ్గి డబ్బు, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మీ సమస్యను పెడితే నిర్ణీత గడువులోగా ఖచ్చితంగా పరిష్కారమవుతుందన్నారు. ప్రజలకు మంచి చేసే జగనన్నకు అందరూ మళ్లీ అండగా ఉండాలన్నారు. రుణమాఫీ, ఉద్యోగాల పేరుతో చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. జగనన్న ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చారన్నారు. అందుకే ప్రజలు జగనన్న వైపే ఉన్నారన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. అలాంటి వ్యవస్థలపై ఆరోపణలు చేస్తూ ప్రతిపక్షాలు పైశాచికానందం పొందుతున్నారని మండిపడ్డారు. అలాంటివారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, గ్రామ సర్పంచ్ మాదాసు పావని, ఎంపీటీసీ కంభంపాటి విజయకుమారి, ఎంపీడీఓ మాధురి, తహసీల్దార్ విజయశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి కోటేశ్వరరావు, భవిరిశెట్టి హనుమంతరావు, మాదాసు రాంబాబు, సరిపూడి శివయ్య, దాసు పలువురు మండలస్థాయి అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



రైతులకు రాయితీ విత్తనాలను అందజేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, అధికారులు

గుండ్లపల్లిలో...

నకరికల్లు: ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని సచివాలయం -2లో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11రకాల దరఖాస్తులకు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆదరణ పొందుతున్న జగనన్న ప్రభుత్వ పని తీరు చూసి ప్రతిపక్షాల నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయాశాఖల అధికారులు చేపడుతున్న శాఖాపరమైన కార్యక్రమాలు, సంక్షేమ, అభివృద్ధికి వెచ్చిస్తున్న ఖర్చును వివరించారు. రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనురాధ, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, మోషే, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏపీఓ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి సంజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై న్యాయవాదుల నిరసన



సత్తెనపల్లి కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో మహిళలపై హీనమైన దాడులు, అక్రుత్యాలు, గృహ దహనాలు, ఆస్తుల ధ్వంసం, విధ్వంసకాండకు నిరసనగా సోమవారం సత్తెనపల్లి తాలూకా మెయిన్ గేట్ వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)రాష్ట్ర పిలుపు మేరకు సత్తెనపల్లి న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి మాట్లాడుతూ మణిపూర్ దమనకాండకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మణిపూర్ హింసాత్మక ఘటనలను నివారించి శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఆదివాసీ మహిళలపై దాడులకు, అకృత్యాలకు పాల్పడిన నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, సీనియర్ న్యాయవాదులు చిట్టా విజయభాస్కర్ రెడ్డి, దేవినేని దస్తగిరి, అనుమోలు జయరాం, బత్తిన శ్రీనివాస్ బాబు, సయ్యద్ అబ్దుల్ రహీం, బంకా సంగీతరావు, జానీ ఖాజావలి, చావా బాబూరావు, దివ్వెల శ్రీనివాస్, గుజ్జర్లపూడి యేసురత్నం, రామిరెడ్డి, జూపూడి శేషయ్య, వెంకటశివ, బుర్రా సైదయ్య, పాపారావు, మధు, అమర్ నాయక్, హరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న దళిత అసోసియేషన్ అధ్యక్షుడు దాసు

రాజుపాలెం: మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు క్రాంతి దళిత అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి దాసు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాతంగి దాసు మాట్లాడుతూ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన వ్యక్తులకు వెంటనే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. యావత్ భారతదేశం తలదించుకునే విధంగా ప్రవర్తించినవారిని నడిరోడ్డుపై ఉరితీసి, వారి ఆస్తులను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. రాజు, కొండలు, ముత్తయ్య, మనోహర్ తదితరులు ఉన్నారు.

వివక్షపై అక్షర సమరం చేసిన గుర్రం జాషువా



గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్
- విశ్వనరుడు గుర్రం జాషువాకు ఘననివాళి

సత్తెనపల్లి: వివక్షపై అక్షరంతో అసమాన యుద్ధం చేసిన విశ్వనరుడు జాషువా సాహితీ సమరం నేటికి సమకాలీనమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్ అన్నారు. విశ్వనరుడు గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి విశ్వనరుడను నేనని గర్వంగా ప్రకటించుకున్న జాషువా మన పల్నాడు జిల్లాకు చెందిన వాడే కావటం మనకు గర్వకారణం అన్నారు. నేటి తరానికి జాషువా సాహిత్యాన్ని తెలియజేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ముందుగా జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దింటి నాగేశ్వరరావు, చిలకా రమణయ్య, తదితరులు ఉన్నారు.



అమరావతిలో గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

ప్రజల గుండెల్లో నేటికీ సజీవంగా జాషువా..

అమరావతి: సమానత్వం కోరుతూ, కుల వివక్షను ఎండగడుతూ కవిచక్రవర్తి గుర్రం జాషువా ఎన్నో రచనలు చేశారని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ అన్నారు సోమవారం స్థానిక ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనలతో కవి కోకిలగా ప్రజల గుండెల్లో గుర్రం జాషువా చిరస్థాయిగా నిలిచారన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలను అనుసరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పౌరాణిక నాటక కళాకారులు జి రాజు, చిక్కాల ఉదయ శేఖర్, బి.నారాయణ, శాంసన్, ఎం.శ్రీనివాసరావు, కోటయ్య పాల్గొన్నారు

నార్నెపాడులో 'ఫ్యామిలీ డాక్టర్'



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు నజీర్ పాల్గొని 95 మందికి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో భాగంగా 60 సాధారణ పరీక్షలతో పాటుగా, 17 మందికి బీపీ, 18 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. రక్త పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ శివపార్వతి, ఎంపీహెచ్‌ఏ మస్తాన్‌రావు, డీఈఓ రవితేజ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సత్తెనపల్లి: ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ, గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందచేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం సకాలంలో పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవ్వటం వలన కేవలం 36 శాతం విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారన్నారు. ఖాళీగా ఉన్న కళాశాలకు ప్రిన్సిపాల్స్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం ఉన్నా పీడీ లేరని, తక్షణమే పీడీని నియమించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ సత్తెనపల్లి డివిజన్ కార్యదర్శి దుగ్గి అమూల్య, జిల్లా కమిటీ సభ్యులు జి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు ఇట్లాస్, సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలకు హెచ్ఎంఐఎస్‌పై శిక్షణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి, అచ్చంపేట, క్రోసూరు, చంద్రారాజుపాలెం, ఫణిదం, 75 తాళ్లూరు, ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలకు, హెల్త్ సూపర్వైజర్లకు, హెల్త్ మేనేజ్మెంట్ సిస్టం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అధికారిణి జి.గీతాంజలి, జిల్లా గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్ఎంఐఎస్ ఫార్మేట్లను ఏ విధంగా పూర్తి చేయాలో వివరించారు. ఆన్‌లైన్‌లో ఫార్మేట్స్ డేటా కేంద్ర ప్రభుత్వానికి అందుతాయి కాబట్టి ప్రతి ఆరోగ్య అంశాలను జాగ్రత్తగా పొందుపరిచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఫార్మేట్స్ విధానంను గూర్చి ఆరోగ్య కార్యకర్తలకు వివరించారు. ఆరోగ్య కార్యకర్తలకు వివిధ యాప్‌లు వినియోగించే విధానం, డేటా సేకరించే విధానంలపై సందేహాలను జిల్లా గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాంజలి మాట్లాడారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి, ఫణిదం వైద్యాధికారి డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత, డాక్టర్ ధర్మశాస్త్రి, సిహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీధర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారులు శిఖ శ్యాంసన్, పోసి పోగు వెంకట్రావు, వివిధ పీహెచ్‌సీల ఫిమేల్, హెల్త్ సూపర్వైజర్లు, సీహెచ్ఓలు, ఎంపీహెచ్ఈఓలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు క్రోసూరులో 'జగనన్న సురక్ష'

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు సచివాలయం-2లో మంగళవారం జరిగే జగనన్న సురక్ష శిబిరానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరుకానున్నట్లు ఎంపీడీఓ బి.మహేష్ సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో ప్రజలు దరఖాస్తు చేసుకున్న అర్జీలకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తప్పక పాల్గొనాలని కోరారు.

పెద్దమద్దూరు బ్రిడ్జి పనుల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని పెద్దమద్దూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పరిశీలించారు. ఈసందర్భంగా అమరావతి నుంచి తుళ్లూరు డబుల్‌రోడ్డు నిర్మాణం, పెద్ద మద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని భావించిన ప్రభుత్వం రూ.44 కోట్ల నిధులను ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మంజూరు చేయటంతో పనులు మొదలుపెట్టామన్నారు. ఈ బ్రిడ్జికి కావాల్సిన 5 ప్రధాన పిల్లర్లలో 4 పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి రెండు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు, ఆర్అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

అమరావతి సచివాలయం-2 నిర్మాణ పనులు పరిశీలన..

మండల కేంద్రమైన అమరావతిలో రూ.40లక్షలతో నిర్మితమవుతున్న సచివాలయం-2 భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. మిగిలిన పనులను కూడా పూర్తిచేసి త్వరలో ప్రారంభించటానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సత్కారం

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 20సంవత్సరాలు, అమరావతి మండలంలో 14 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడుగా సేవలు అందించిన బలుసుపాటి సత్యనారాయణ పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాయలంలో సత్కరించారు. ఇటీవల విద్యాశాఖ చేపట్టిన ప్రమోషన్లో సీనియారిటీ ఆధారంగా నిర్వహించిన మలి విడత కౌన్సెలింగ్లో సత్యనారాయణ అమరావతి మండలం నుంచి ఈపూరు మండలం అగ్నిగుండలా ప్రాథమికోన్నత పాఠశాలకు పదోన్నతిపై వెళ్లారు. ఈ నేపథ్యంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు సత్యనారాయణను శాలువాతో సన్మానించారు. మునుగోడు మాజీ సర్పంచ్ మేకల శివశంకర్, మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది ముక్తుం బాషా, రెబ్బా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

అమరావతి: మండల పరిధిలోని లింగాపురం రైతు భరోసా కేంద్రంలో సోమవారం మండల వ్యవసాయాధికారి అహ్మద్ ఆధ్వర్యంలో వరిలో విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ శివకుమారి మాట్లాడుతూ రైతులు విత్తనోత్పత్తి చేసుకుంటే ఎటువంటి నకీలలకు అవకాశం ఉండదన్నారు. అలాగే రైతులకు ఒక విత్తనంలో వేరే విత్తనం కలపకూడదన్నారు. అలాగే జన్యు స్వచ్ఛత కూడా పెరుగుతుందన్నారు. ఈసందర్భంగా విత్తనోత్పత్తి ఏవిధంగా చేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు పారదర్శకంగా విధులు నిర్వహించాలి



ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న తహసీల్దార్ జాన్‌సైదులు


శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో బీఎల్‌వోలు ఓటర్లు నమోదు సర్వే కార్యక్రమాన్ని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటర్ల సర్వే కార్యక్రమం వచ్చే నెల 21 వరకు ఇంటింటికీ బూత్ లెవల్ అధికారుల చేస్తారని, ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు నకిలీ ఓట్లు తొలగింపు మార్పులు చేర్పులు వందేళ్ళు వయస్సు పైబడిన వారిని గుర్తించటం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి వారి అభీష్టం మేరకు ఏప్రాంతంలో ఉంచాలో అడిగి తెలుసుకొని అక్కడ జాబితాలో ఉంచేలా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, వీఆర్వో అమల, బీఎల్‌వో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని బరంపేటలో సోమవా రం చోటు చేసుకుంది. మండలంలోని ఇస్సప్పాలెం గ్రామానికి చెందిన కాపులపల్లి సత్యనారాయణరెడ్డి ద్విచక్ర వాహనంపై బరంపేట బైపాస్‌లో వస్తుండగా కేఎస్ఆర్ ఫంక్షన్ ప్లాజ్ సమీపంలో కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పడంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. మృతుడు సత్యనారాయణరెడ్డి ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.

భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ



అల్లూరివారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నరసరావుపేటరూరల్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా మండలంలోని అల్లూరివారిపాలెంలో డెంగీ వ్యాధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమ పుట్టకూడదు దోమ కుట్టకూడదని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చేస్తే దోమ పుట్టదని, దోమతెరలు, మెష్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమలు కుట్టవని తెలిపారు. దీనిని పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన మొహర్రం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో పీర్లు



పీర్ల చావిడిలలో అలంకరణలో పీర్లు

శావల్యాపురం: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీర్ల సవాడిలో పీర్లను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం చిన సరిగత్ సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పీర్లు ఎత్తుకొని నిప్పుల గుండల్లో నడవటం అనవాయితీగా వస్తోంది. ఈనెల 28న పెద సరిగత్ వేడుకల సందర్భంగా నిప్పుల గుండలో నడిచి అనంతరం గ్రామ పురవీధుల్లో పీర్లను సూర్యదయం వరకు మేళాలతో ఉరేగిస్తారు. చివరిరోజు ఈనెల 29న సాయంత్రం 3 గంటల నుంచి సంప్రదాయ మేళాతాళాలు కనకతప్పట్లు నడుమ పీర్లను గ్రామపురవీధుల్లో ఊరేగింపుతో అనంతరం పండుగ వేడుకలు ముగుస్తాయని పీర్లు నిర్వాహకులు తెలిపారు. కులమతాలకు అతీతంగా వేడుకలు జరపటం విశేషం. ముస్లిం సోదరులు పీర్లను అలంకరణ చేసి నూరుబాష సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక దువా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా పీర్ల సవాడిని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, సంతగుడిపాడు, రొంపిచర్ల, మునమాక, అన్నవరం, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్లచావిడిలలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఐదో సర్గత్‌ను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నుండే వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆరో సర్గత్‌ను పురస్కరించుకొని సోమవారం పీర్ల చావిడిలలో అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విప్పర్లపల్లి గ్రామంలో ముస్లిం యువకులు పెద్దపులి, వేటగాడు వేషధారణతో డప్పు, వాయిద్యాల మధ్య సందడి చేశారు.